సెట్విన్‌లో శిక్షణ.. భవితకు భరోసా..

● ఏడాదిలోనే 22 అంశాల్లో 1,227 మందికి.. ● యువత, మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ● మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి చొరవతో..

మేడిపల్లి: గ్రేటర్‌వాసులందరికీ తెలిసిన పేరు సెట్విన్.. యువత, మహిళలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఏర్పడిన సెట్విన్ ఎన్నో వేల మంది భవితకు భరోసా కల్పించింది. పాతబస్తీలోని పురాణ హవేలీలో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి సెట్విన్‌ను నెలకొల్పారు. అప్పటి నుంచి ఎంతో మందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి.. ఎన్నో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించారు. శిక్షణ తీసుకున్న ఎంతో మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. సెట్విన్ సేవలను మేడ్చల్ జిల్లాలోని యువత, మహిళలకు అందించాలని లక్ష్యంతో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డితో పాటు పాలక వర్గ సభ్యులు, కార్పొరేటర్లు, కమిషనర్ రామకృష్ణారావు, సెట్విన్ యాజమాన్యాన్ని కోరారు. దాంతో పాటు శిక్షణ కోసం ప్రత్యేక భవనం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో 2021 నవంబర్ 2వ తేదీన పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో సెట్విన్ కేంద్రానికి మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు.


సెట్విన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు(ఫైల్)

ఈ కోర్సుల్లో శిక్షణ

యువత, మహిళలు స్వయంగా ఉపాధి పొందేలా వివిధ కోర్సుల్లో శిక్షణ అందజేస్తున్నారు. కంప్యూటర్, బ్యూటీషియన్, టైలరింగ్, ఏసీ, ఫ్రిడ్జ్, మొబైల్, సీసీటీవీ రిపేరింగ్, మెహిందీ, మగ్గం వర్క్, బ్యాగ్ ప్యాకింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ప్రీప్రైమరీ టీచర్ ట్రైనింగ్ వంటి సమారు 22 ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు.

భవిష్యత్‌లో వీటిలో శిక్షణ..

యువతకు మరిన్ని రంగాల్లో శిక్షణ ఇవ్వాలనే సంకల్పంతో నిర్మాణ రంగంలో ఉపాధి కల్పించేందుకు కార్పెంటరీ, ప్లంబింగ్, శానిటేషన్, పెయింటింగ్, డెకరేషన్, వెల్డింగ్, ఆర్కిటెక్చవల్ అసిస్టెంట్‌షిప్, కర్టెన్ అండ్ గార్మెంట్ స్టిచింగ్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, స్టోర్ కీపర్, ల్యాండ్ సర్వేయర్ తదితర కోర్సులను ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సెట్విన్ ఇన్‌చార్జి తెలిపారు.

ఏడాదిలో 1,227 మంది..



సెట్విన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఏడాది దాటిపోయింది. 1,227 మందిని నాలుగు బ్యాచ్‌లుగా విడదీసి 22 అంశాల్లో శిక్షణ ఇచ్చాం. శిక్షణ తీసుకున్న వారంతా ఉపాధి పొందుతున్నారు. బ్యూటిషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, టైలరింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ తదితర అంశాల్లో శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి పొందుతున్నారు. కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ తీసుకున్న వారు జాబ్‌మేళాతో పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. సుమారు 11 మంది సెట్విన్ ఉద్యోగులు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశాం.

– వనజ, పీర్జాదిగూడ సెట్విన్ ఇన్‌చార్జి

యువత, మహిళలకు భరోసా..



మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు. తమకు ఇష్టమైన రంగాల్లో శిక్షణ పొంది సొంతంగా ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ఎంతో మంది మహిళలకు సెట్విన్ ఓ భరోసాగా మారింది. మహిళలు శిక్షణ పొందడంతో ఎన్నో కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. వారి ఆదాయం కుటుంబాలకు ఆసరాగా మారింది. ఉద్యోగాలే కాకుండా సొంత వ్యాపారాల వైపు యువత దృష్టిసారిస్తున్నారు. సెట్విన్‌లో శిక్షణ తీసుకున్న యువత సొంతంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా జీవితాన్ని సంతోషంగా గడుపుతున్నారు.

– జక్కా వెంకట్‌రెడ్డి, మేయర్, పీర్జాదిగూడ

మళ్లీ టికెట్ల లొల్లి

హెచ్‌సీఏ తీరుపై అభిమానుల ఆగ్రహం

ఉప్పల్: భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య ఈ నెల 18న జరగనున్న క్రికెట్ మ్యాచ్ టికెట్ల లొల్లి మొదటికి వచ్చింది. ఎప్పటి వలెనే పేటీఎం పోర్టల్ తెరుచుకున్న గంట లోపే మళ్లీ మూసుకు పోవడంపై అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పేరుకు మాత్రమే పేటీఎం సంస్థకు అప్పజెప్పి తెరవెనుక బ్లాక్ దందా నడిపిస్తోందని అభిమానులు తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు. అమాత్యులకు అమాంతగా టికెట్లు అందుబాటులోకి వస్తున్నాయని, అభిమానులకు మాత్రం అష్టకష్టాలు పడ్డా టికెట్ లభించడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి సారీ క్రికెట్ అభిమానుల మనోభావాలను దెబ్బ తీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉప్పల్ స్టేడియంలో మొత్తం 39 వేల సీటింగ్ కెపాసిటీ ఉండగా.. 29,417 టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు హెచ్‌సీఏ ప్రకటించింది. ఈ నెల 13న కేవలం 6 వేలు, 14, 15వ తేదీల్లో 7 వేల టికెట్లను విక్రయించారని మిగిలినవి 16న విక్రయించాల్సి ఉండగా మొదటి రోజు నుంచి విక్రయాల్లో తీవ్ర గందరగోళం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హెచ్‌సీఏ ఈసారి పూర్తి టికెట్ల విక్రయాలు ఆన్‌లైన్‌లో మాత్రమే అందుబాటులో ఉంచినట్లు ప్రకటించి వాటిని అభిమానులకు అందజేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తున్నారు. రాచకొండ పోలీసులు స్టేడియం ఆవరణను తమ అధీనంలోకి తీసుకున్నారు. బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ముందస్తుగా స్నేక్ క్యాచ్ బృందాన్ని రప్పించి తనిఖీలు నిర్వహించారు.


ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం

రాష్ట్రానికి సంక్రాంతి కానుక 'వందే భారత్'

కుషాయిగూడ: సంక్రాంతి కానుకగా తెలంగాణ రాష్ట్రానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాని మోదీ ఇచ్చారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన సికింద్రాబాద్ టూ విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆదివారం చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో బీజేపీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైల్‌లో ఉన్న వసతులను పరిశీలించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేసి జెండా ఊపి రైల్‌ను ముందుకు సాగనంపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి కేంద్ర రైల్వే మంత్రి సాయంతో నిధులు మంజూరు చేసి చర్లపల్లి రైల్వే టెర్మినల్ అభివృద్ధికి కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు దిలిప్‌కుమార్, గుల్షన్‌సింగ్, బీజేపీ నాయకులు నాదం, కొమ్ము నర్సింగరావు, తాళ్ల ఆనంద్‌గౌడ్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, నాగమణి, రాంబాబు, గణేష్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


చర్లపల్లిలో జెండా ఊపుతున్న ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ శ్రీ మన్నారు రంగనాయక స్వామి ఆలయంలో శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయం ఆవరణలో ఉత్సవ విగ్రహాలను అందగా అలంకరించి ప్రత్యేక వేదికపై ప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ కల్యాణ వేడుకలు నిర్వహించారు. నగరం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వేడుకల్లో యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ ఈఓ గీతారెడ్డి, ఎదులాబాద్ ఆలయ ధర్మకర్తలు పురుషోత్తమాచార్యులు, అనంతసేనాచార్యులు, పవనాచార్యులు, అచ్యుతాచార్యులు, శ్రీవత్సాచార్యులు, శేనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరోగ్య తెలంగాణే కేసీఆర్ లక్ష్యం


మాట్లాడుతున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: ఆరోగ్య తెలంగాణే కేసీఆర్ లక్ష్యమని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం కమ్యూనిటీ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తాము సహకారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రకాశ్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు



మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన 46 మంది అయ్యప్ప స్వాములు శబరిమలకు సోమవారం బయలు దేరారు. గురుస్వాములు నర్సింహ, ఆనంద్, కుమార్, వర్మ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో అదనపు గదులు నిర్మించాలి


విద్యాశాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థలంలో అదనపు గదులను నిర్మించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో కలిసి మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. పాఠశాల గదులను త్వరగా నిర్మించాలని సంబంధిత అధికారులకు మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తాండ వాసుగౌడ్, పీఆర్. పాండు, నర్సింగ్‌రావు, శ్రవణ్, రాపోలు శ్రీనువాస్ తదితరులు ఉన్నారు.

'5 కిలోల రేషన్ బియ్యం రాష్ట్రమే ఇస్తుందనడం సిగ్గుచేటు'

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం నెలకు 5 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తుంటే 'సొమ్మొకరిది సోకొకరిది' అన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎదులాబాద్ రేషన్ దుకాణాన్ని సోమవారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ... అంగన్‌వాడీ, పాఠశాలలు, డంపింగ్‌యార్డ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం, రైతు వేదికల నిర్మాణాలకు కేంద్రమే నిధులు అందజేస్తుందన్నారు. కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ కార్యకర్తలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుమార స్వామి, వార్డు సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్, సురేశ్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, లింగం, శంకర్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిలో 25 ఫిర్యాదులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులు, దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులు సత్వరమే వాటిని పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి హాలులో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి వచ్చిన 25 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు అక్కడికక్కడే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్యోత్సవం



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కనుమ పండగ సందర్భంగా సోమవారం ప్రణవి బృందం కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఇందుమతి, గంటి శిష్యబృందం ప్రదర్శన వావ్ అనిపించింది. అనంతరం గంగి రెద్దులు, హరిదాసులు, బుడబుక్కల, జంగమ దేవరులు, ఎరుకల సాని, పిట్టల దొరలు సందడి చేశారు.

నివాళి



గౌతంనగర్: మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా మల్కాజిగిరికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బోనగిరి సురేష్‌యాదవ్ ఘనంగా నివాళులర్పించారు.

నిబంధనల పేరుతో అణిచివేత


కాప్రా సర్కిల్ డీసీ శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్

కాప్రా: కొత్త నిబంధనల పేరుతో రోజురోజుకూ కక్ష పూరితంగా కాంట్రాక్టర్లను అణిచివేసే ధోరణితో కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ పనుల విషయంలో షరతులతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సోమవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్‌కు కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో కొందరు ఈఈలు నిబంధనల పేరుతో క్లాస్–5 కాంట్రాక్టర్లకు రూ.5 లక్షలలోపే పనులు ఇవ్వడం, నూతన కాంట్రాక్టర్లను అణిచివేస్తున్నారని మండిపడ్డారు. ఏడేళ్లుగా కొందరు స్టాఫ్ ఇంజినీర్లు ఒకే ప్రాంతంలో పాతుకుపోవడంతో కొత్త నిబంధనలతో సొమ్ము చేసుకుని టెండర్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నూతన నిబంధనలను ఆసరాగా చేసుకుని కొందరు సొమ్ము చేసుకోవడంతో జీహెచ్ఎంసీ ఆదాయానికి గండిపడుతోందన్నారు. క్లాస్–5 కాంట్రాక్టర్లకు రూ.50 లక్షలలోపు పనుల టెండర్లలో కూడా అవకాశం కల్పించాలని, సీనియర్లకు వాళ్ల టర్నోవర్‌ను బట్టి టెండర్లలో అవకాశం కల్పించాలని కోరారు. ఒక కాంట్రాక్టర్‌కు రెండు పనులు మాత్రమే కేటాయింపు విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీలో నూతనంగా తీసుకొచ్చిన షరతులను తొలగించి పంచాయతీ రాజ్, ఇరిగేషన్, ఇతర మున్సిపాల్టీ, రైల్వేశాఖ, నౌకాదళంలో ఎలా కేటాయిస్తున్నారో అదేవిధంగా జీహెచ్ఎంసీలో కూడా టెండర్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, చీఫ్ అడ్వైజర్ రవీంద్రసాగర్, జనరల్ సెక్రటరీ చందు సాగర్, బిచ్చన్న, శశిధర్ సాగర్, లలిత, సైదులు, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ


అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో..

అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో కేలండర్‌ను ఆలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ చేతులమీదుగా సోమవారం ఆవిష్కరించారు

మంత్రి చేతులమీదుగా...

మల్లాపూర్: డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి రూపొందించిన కేలండర్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హోంమంత్రి, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో హబ్సిగూడ మాజీ కార్పొరేటర్ బేతి స్వప్నరెడ్డి, బీఆర్ఎస్ నేతలు వాసుగౌడ్, పీఆర్.ప్రవీణ్, నర్సింగ్‌రావు, శ్రవణ్‌రెడ్డి, రాపోలు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..

రామంతాపూర్: రామంతాపూర్ ముదిరాజ్ సంఘం కేలండర్‌ను ఎమ్మెల్సీ బండ ప్రకాష్ సోమవారం ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, మురళీకృష్ణ, నర్సింహులు ఉన్నారు.


కేలండర్ ఆవిష్కరిస్తున్న హోంమంత్రి మహ్మూద్ అలీ తదితరులు


రామంతాపూర్ ముదిరాజ్ సంఘం కేలండర్

మహిళ అనుమానాస్పద మృతి


చంద్రకళ(ఫైల్)

మల్కాజిగిరి: కల్లు కాంపౌండ్ నుంచి అదృశ్యమైన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్, ఎస్ఐ హరిప్రసాద్ వివరాల ప్రకారం.. మౌలాలి ఓల్డ్ సఫిల్‌గూడ భరత్‌నగర్‌కు చెందిన నీలోల్ల రాజు, చంద్రకళ(38) భార్యాభర్తలు. కూలి పనిచేసే వీరికి రోజూ కల్లు తాగే అలవాటుంది. ఈ నెల 5వ తేదీ లాలాపేట్‌లోని కల్లుదుకాణానికి ఇద్దరూ కల్లు తాగేందుకు వచ్చారు. కొద్ది సేపటి తర్వాత పని ఉందని రాజు వెళ్లిపోయాడు. అదేరోజు రాత్రి కల్లు దుకాణంలో పనిచేసే వ్యక్తి రాజుకు ఫోన్ చేసి చంద్రకళ కల్లు బాటిళ్లు, చీరె ఉన్న సంచి వదిలిపెట్టి వెళ్లిందని చెప్పడంతో వాటిని తీసుకొని ఇంటికి వచ్చాడు. కొన్నిసార్లు కల్లు తాగి ఆమె ఇంటికి ఆలస్యంగా వస్తుంది అని అనుకున్నాడు. మరుసటి రోజు కూడా రాకపోవడంతో పాటు ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో ఆమె కోసం వెతికాడు. ఫలితం లేకపోవడంతో 7వ తేదీ ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 16వ తేదీ మౌలాలి రైల్వే పోలీస్‌స్టేషన్ వెళ్లే దారిలో ఉన్న రైల్వే ఖాళీ ప్రదేశంలో పూర్తిగా కుళ్లిపోయిన మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చంద్రకళ కుటుంబసభ్యులకు పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆమె కూతురు నరేష్ అలియాస్ నైనా, భర్త రాజు ఘటనా స్థలానికి చేరుకొని చంద్రకళగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. చంద్రకళ కూతురు నరేష్ అలియాస్ నైనా ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సంక్రాంతి సంబురం


ఓల్డ్ మల్లాపూర్‌లో సంక్రాంతి ముగ్గుతో మహిళ


పతంగులను పంపిణీ చేస్తున్న ఎండీ ఉస్మాన్


ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న చిన్నారులు


మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో...


పతంగులతో యువకుల సందడి